పందులతో ఇబ్బందులు

- వట్టణ ప్రాంతాల్లో స్వైర విహారం
- వరాహాల నియంత్రణలో అధికారులు విఫలం
- పెంపకందారులకు ఇతర ఉపాధి చూపని వైనం
- రోగాలు వస్తాయని స్థానికుల్లో ఆందోళన


చినముషిడివాడలో సంచరిస్తున్న పందుల గుంపు


పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో తిరుగుతున్న పందులు


శారదానగర్‌లో పందుల సంచారం

పెందుర్తి: వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. దోమలు, ఈగలతో రోగాలు విజృంభిస్తున్నాయి. ఈ క్రమంలో పలు రోగాలకు వాహకాలైన పందులతో కూడా యుద్ధం చేయాల్సిన దుస్థితి విలీన ప్రాంతాల ప్రజలది. పట్టణ ప్రాంతాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా జనావాసాల్లో సంచరిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. నివాసాల మధ్యలో ఉన్న మురుగును ఆవాసాలుగా చేసుకుని తిష్ట వేస్తున్నాయి. అకస్మాత్తుగా ఇళ్లల్లోకి చొరబడి నివాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎన్నో స్వల్ప, దీర్ఘకాలిక రోగాలకు కారకాలైన పందుల నియంత్రణలో అధికార యంత్రాంగం దారుణంగా విఫలమతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు నియంత్రణలోకి రాని తరుణంలో పందుల సంచారంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు పందుల పెంపకందారులకు వాటి వల్ల కలిగే నష్టాలను వివరించి, వారిని మరో జీవనోపాధి వైపు చైతన్యపరచడంలో కూడా యంత్రాంగం విఫలమవుతోందన్న ఆరోపణలున్నాయి.

మురుగులో తిష్ట..

పందుల వృద్ధికి విలీన ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతున్న మురుగు కూడా కారణం. సాధారణంగా పందులకు మురుగే నివాస ప్రాంతం. ఈ క్రమంలో జీవీఎంసీ జోన్–8 పరిధిలోని పది వార్డుల్లో ఎక్కడ చూసినా అవుట్ లెట్ సదుపాయం లేక మురుగు నిలిచిపోతోంది. దీంతో పందుల సంచారం కూడా పెరిపోతోంది. చాలా ప్రాంతాల్లో ఇళ్ల మధ్య మురుగులోనే పందులు ఆవాసంగా చేసుకుని ఉండటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పందుల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ ప్రాంతాల్లో అధికంగా సంచారం..

పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వందలాది పందులు సంచరిస్తున్నాయి. పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో పందుల పెంపకం కేంద్రాలు అధికంగా ఉన్నాయి. జీవీఎంసీలో విలీనమైన ఆయా ప్రాంతాల్లో వాడుక నీరు పోయేందుకు సరైన అవుట్ లెట్ సదుపాయం లేదు. ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోవడం పందుల సంఖ్య పెరగడానికి కారణమవుతోంది. జీవీఎంసీ అధికారులు పందుల నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా.. అది కార్యరూపం దాల్చడం లేదన్న ఆరోపణలున్నాయి.

పందుల నియంత్రణకు చర్యలు

పందుల సంచారంపై ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రత్యేక బృందాల ద్వారా పందుల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల పందుల నివారణకు డ్రైవ్ నిర్వహించాం. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా చర్యలు చేపడతాం.

– హైమావతి, జోన్–8 కమిషనర్, జీవీఎంసీ

క్లుప్తంగా

నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి : మండలంలోని సౌభాగ్యరాయపురం (ఎస్‌ఆర్ పురం)లో కొలువుదీరిన కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కాయితి ఎర్రిబాబు, దూది వెంకటరమణ, గొరపల్లి సోము నాయుడు, గొల్లవిల్లి గణేష్, యర్ర రమణ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ అప్పారావు బాధ్యతల స్వీకరణ



పరవాడ: లంకెలపాలెం సబ్ రిజిస్ట్రార్‌గా ఎం. అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి సబ్ రిజిస్ట్రార్‌గా ఆయన పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మీడియాతో అప్పారావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు అవసరమైన సేవలందించడానికి కృషి చేస్తానని తెలిపారు.

పీలా గోవింద్‌కు అభినందనలు

పెందుర్తి : రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద సత్యనారాయణను రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు అభినందించారు. పెందుర్తిలోని పీలా నివాసంలో ఆయన్ని ఆదివారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఉపాధ్యక్షుడు బలగా చిన్నారావు, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పెందుర్తి లేఖర్ల సంఘం ప్రతినిధులు డి.సుధీర్, ఎ.శ్రీనివాసరావు, జి.శంకర్, పి.కరుణ, టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గొల్లగుంటలో పారిశుధ్య పనులు

పరవాడ: మండలంలోని రావాడ శివారు గొల్లగుంట గ్రామంలో పరిసరాలను పారిశుధ్య సిబ్బంది ఆదివారం శుభ్రం చేశారు. గ్రామంలోని వీధి రోడ్లను శుభ్రం చేసి బ్లీచింగ్ పిచికారీ చేశారు. అయితే గ్రామంలో సిబ్బంది కొరత ఉండడంతో ఇద్దరితోనే పనులు నిర్వహిస్తున్నారు. మరోవైపు తమకు జీతాలు చెల్లించడం లేదని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. సెలవు రోజుల్లో పని చేయించి సాధారణ రోజుల్లో చెల్లించే వేతనాలనే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో పారిశుధ్య సిబ్బందిని పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

పరవాడ: లంకెలపాలెంలో బీసీ బాలుర వసతి గృహంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డి.ఉదయ్, వై.గోవిందరావు, ప్రసాద్, సంతోష్, సూర్య, రమణ, తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పినగాడిలో అన్నసమారాధన


గణపతిని దర్శించుకుంటున్న గండి రవి, కమిటీ ప్రతినిధులు

పెందుర్తి : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పినగాడిలో ఆదివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత గండి రవి కుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించగా... 1500 మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. యూత్ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం


వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు తదితరులు

సబ్బవరం: ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని సబ్బవరంలో అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 7వ వార్షికోత్సవాన్ని సంఘం చైర్మన్ పాట్నూరి అప్పారావు అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఉద్యానవన పంటల సాగుపై ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పించినట్టు చెప్పారు. సబ్బవరం మండలంలోని 41 గ్రామాల్లో సుమారు 1,050 మంది రైతులు అమృతఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సభ్యులుగా ఉన్నారన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు పండించిన పంటలను ఉత్పత్తిదారుల సంఘానికి విక్రయించడం ద్వారా మద్దతు ధరను పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు సంఘంగా ఏర్పడి వ్యవసాయాన్ని చేస్తే ప్రభుత్వం ద్వారా ప్రోత్సాహాన్ని అందించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాల గురించి వివరించారు. జాగృతి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుజాత మాట్లాడుతూ జాగృతి సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణ ఆశయాల మేరకు అమృతఫల సంఘం డైరెక్టర్లు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం అమృతఫల వార్షిక నివేదికను ఆవిష్కరించారు. కంపెనీ వార్షిక నివేదికను సభకు సీఈవో కె.మౌక్తిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ హెచ్‌వో కిరణ్మయి, అగ్రి కన్సల్టెంట్ వి.రెడ్డినాయుడు, అమృతఫల సంఘం డైరెక్టర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీగా పెదగాడి


పెదగాడిలో స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందంతో సర్పంచ్ కేసుబోయిన లావణ్య, తదితరులు

పెందుర్తి : స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ డిఫెక్షన్ ఫ్రీ (ఓడీఎఫ్) పథకంలో పెందుర్తి మండలం పెదగాడి ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ కేంద్ర బృందం ఆదివారం పంచాయతీలో పర్యటించింది. సచివాలయంలోని రికార్డులు పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య పనులపై ఆరా తీశారు. స్థానిక ప్రజలతో మాట్లాడి పంచాయతీ యంత్రాంగం అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 'నాడు – నేడు' పథకం నిధులతో చేపట్టిన పనులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ కేసుబోయిన లావణ్య అందిస్తున్న సేవలను అభినందించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందిని ప్రశంసించారు.


'అడవివరం సొసైటీ' అభివృద్ధికి విశేష కృషి



2024-25 అంచనా ఆదాయ, వ్యయాల పేపర్లను చూపిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, డైరెక్టర్లు

సింహాచలం: అడవివరం కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లేందుకు ప్రస్తుత పాలకవర్గం విశేష కృషి చేస్తోందని సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. అడవివరంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపలో ఆదివారం సొసైటీ మహా జనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకుని ఏళ్ల తరబడి చెల్లించకుండా ఉన్న వారంతా వెంటనే చెల్లించాలని కోరారు. మొండి బకాయిలు వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అందిరికీ 8 శాతం వడ్డీ ఇస్తున్నామని, సీనియర్ సిటిజన్లకు రానున్న జనవరి నుంచి 8.5 శాతం వడ్డీ ఇస్తామని చెప్పారు. సొసైటీ భవనం పైఅంతస్తు నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులకు రీటెండర్ పిలుస్తామన్నారు. ప్రహ్లాదపురంలోని సొసైటీ బ్రాంచీని సొంత స్థలంలో త్వరలో నిర్మిస్తామని చెప్పారు. మార్చి 31, 2022లోపు బంగారు వస్తువులపై రుణాలు తీసుకుని చెల్లించని వారి వస్తువులను బహిరంగ వేలం వేస్తామన్నారు. ముందుగా వారికి నోటీసులు జారీ చేస్తామన్నారు. షార్ట్ టర్మ్ డిపాజిట్లపై వడ్డీ పెంచేందుకు ఆలోచిస్తున్నట్లు చెప్పారు. 2024–25 సంవత్సరానికి గాను రూ.9.11 కోట్లతో రూపొందించిన ఆదాయ, వ్యయాల బడ్జెట్ పేపర్లను చదివి వినిపించారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేష్, డైరెక్టర్లు కొలుసు గురునాథరావు, బోర ప్రసాదరెడ్డి, మజ్జి ధర్మా, గేదెల మురళీకృష్ణ, లండ వెంకటరమణ, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, గునిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థులు

మహారాణిపేట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ జూనియర్ కాలేజ్ 1982 – 84 బ్యాచ్ విద్యార్థులు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కాలేజీ విద్య పూర్తి చేసుకుని 40 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అనంతరం సామాజిక సేవలో భాగమైన పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో పట్నాల నాగరామ్మోహన్ రెడ్డి, కరణం వేణుగోపాల్, గుజ్జు ఉప్పల్ రెడ్డి, ఎర్ర అప్పారావు, శ్రీలక్ష్మి, మణి కుమారి, అప్పలరెడ్డి, జగ్గారావు, సోంబాబు, దోమడ హరి, రామకృష్ణ రాజు, సీహెచ్ అప్పారావు, చిట్టిబాబు, ధర్మ, పి.సత్యనారాయణ, గంగాధర్, బేగం, అప్పల నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి


కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ బంధోపాధ్యాయ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనన్య బంధోపాధ్యాయ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం


ఏఈవోకు చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్, ఉమారమణి దంపతులు లక్షా 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో అన్నప్రసాద విభాగం ఏఈవో పిల్లా శ్రీనివాసరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామి వారి దర్శనం కల్పించి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పీఆర్‌వో నాయుడు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

క్రీడలతో జాతీయ సమైక్యత

మురళీనగర్ : క్రీడలతో జాతీయ సమైక్యత సాధించవచ్చని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ విజేతలైన క్రీడాకారులను మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న వారికి ఆర్థికంగా సహకారం అందించేందుకు స్వచ్ఛంద, ఇతర సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ – 2024లో పాల్గొని 21 పతకాలు సాధించిన విజేతలకు మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య స్థాపించిన జనకుల ఫౌండేషన్ తరపున నగదు ప్రోత్సాహకాన్ని ఆయన అందించారు. మలేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడానికి సిద్ధమైన ఏడుగురు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందించారు. కార్యక్రమంలో వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్ష, కార్యదర్శులు సనపల వరప్రసాద్, సత్యనారాయణరాజు, జనకుల ఫౌండేషన్ ధర్మకర్త సీహెచ్ శ్రీనివాసరాజు, వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి జయ, యూనివర్సల్ యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ వంశీ పాల్గొన్నారు.

రామశర్మకు బాలి స్మారక పురస్కారం


రామశర్మకు పురస్కారం అందిస్తున్న అతిథులు

సీతంపేట: విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బాలి (మేడిశెట్టి శంకర రావు) జయంతి సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సభాధ్యక్షుడు శిరేల సన్యాసిరావు మాట్లాడుతూ బాలితో తనకు గల పరిచయం, అనుభవాలు, బాలి చిత్రకళా నైపుణ్యం వివరించారు. అనంతరం కొచ్చెర్లకోట సత్యనారాయణ చేతుల మీదుగా ప్రముఖ కార్టూనిస్ట్ పార్వంది వెంకట రామశర్మకు బాలి స్మారక పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. బాలి కుమార్తె మేడిశెట్టి వైశాలి రూ.5 వేలు నగదు పురస్కారం అందజేశారు. పురస్కార గ్రహీత రామశర్మ మాట్లాడుతూ బాలు స్మారక పురస్కారం అందుకోవడం చాలా ఆనందంగా ఉందని, కార్టూన్స్ గీయడంలో తనకు బాలి ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆర్.వి.రమణమూర్తి, వెలమల సిమ్మన్న, చలపతిరావు, సరోజ, యస్.హనుమంతరావు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు

ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు


పెందుర్తిలోని మహా కామేశ్వరి అమ్మవారు


ఎస్‌ఆర్ పురంలో కనకదుర్గమ్మ


శ్రమశక్తినగర్‌లో పంచముఖ గాయత్రి


సప్తగిరినగర్‌లో అలివేలు మంగమ్మ

పెందుర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గం ముస్తాబవుతుంది. పెందుర్తి ప్రాంతంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అమ్మవారు కొలువుదీరేందుకు పీఠాలు, ఆలయాలు, మండపాలు సిద్ధమవుతున్నాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 12న ఉత్సవాలు ముగుస్తాయని ఆయా ఆలయాల ప్రతినిధులు ఆదివారం వెల్లడించారు.

మహాకామేశ్వరి ఆలయంలో...

పెందుర్తిలోని మహా కామేశ్వరి సహిత ద్వాదశ జ్యోతిర్లింగాల సముదాయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధి డి.వై.చైనులు తెలిపారు. తొలి రోజు అమ్మవారు రజత కవచ అలంకారం, 4న బాలత్రిపుర సుందరి దేవిగా, 5న గాయత్రిమాతగా, 6న అన్నపూర్ణాదేవిగా, 7న లలిత త్రిపుర సుందరిదేవిగా, 8న మహాలక్ష్మిదేవిగా, 9న సరస్వతిదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్దినిగా, 12న రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు దర్శనమిస్తారన్నారు. అదే రోజు అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామని, భక్తులంతా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అలివేలు మంగమ్మ సన్నిధిలో...

చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధిలో గురువారం నుంచి వీరలక్ష్మి ఆరాధన, శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకల కోసం దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. తొలి రోజు ఆదిలక్ష్మిగా, 4న ధాన్యలక్ష్మి, 5న ధైర్యలక్ష్మి, 6న గజలక్ష్మి, 7న సంతానలక్ష్మి, 8న విజయలక్ష్మి, 9న విద్యాలక్ష్మి, 10న ధనలక్ష్మి, 11న అమ్మవారు చందనాలంకరణలో దర్శనమిస్తారని చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ బొమ్మల కొలువు ఉంటుందన్నారు. 4న ప్రత్యేకంగా సామూహిక కుంకుమార్చన ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ముగింపు సందర్భంగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేస్తామన్నారు. భక్తులంతా పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.

- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఎస్‌ఆర్ పురంలో కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్త కాయిత ఎర్రిబాబు తెలిపారు.

రహదారుల అంచుల్లో పొంచి ఉన్న ప్రమాదం


పరవాడ సబ్‌స్టేషన్-సినిమా హాల్ మధ్య ప్రమాదకరంగా రహదారి అంచులు

పరవాడ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రవహించిన నీరు కారణంగా మండలంలో పలు చోట్ల రోడ్ల పక్కనున్న మట్టి పూర్తిగా కొట్టుకుపోయింది. రహదారుల అంచులు ప్రమాదకరంగా మారడంతో ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఊటగెడ్డ కూడలి వరకు ఈ పరిస్థితి ఉంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ద్విచక్ర వాహనా లు, కార్లు, బొగ్గు, బూడిద లారీలు ప్రయాణిస్తాయి. ఫార్మాసిటీ, ఎన్టీపీసీ, ఎస్‌ఈజెడ్, హిందూజా పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. విధులు ముగించుకొని రాత్రి వేళల్లో ఇళ్లకు చేరే క్రమంలో చీకటిలో రోడ్డు అంచుల వద్ద వాహనాలు జారి బోల్తా పడుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మార్జిన్‌లను మట్టితో పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

● తీరంలో సందడి


తిక్కవానిపాలెం తీరంలో సముద్ర స్నానాలు ఆచరిస్తున్న సందర్శకులు

పరవాడ : తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో ఆదివారం సందడిగా మారాయి. ఉమ్మడి జిల్లాల నలుమూలల నుంచి తరలివచ్చిన సందర్శకులు తీరంలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ వంటి ఆట పాటలు, డ్యాన్సులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. సాయంత్రం తీరంలో సముద్ర స్నానాలు ఆచరించారు.

బంటా కాలనీ వాసులకు నష్ట పరిహారమివ్వాలి


ఆందోళన చేస్తున్న బంటా కాలనీ వాసులు

పెందుర్తి: ఎల్జీ పాలిమర్స్ ప్రమాద సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురైన తమకు నష్ట పరిహారం అందించాలని వేపగుంట సమీపంలోని బంటా కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కాలనీలో వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రమాదం జరిగిన రోజు తాము అస్వస్థతకు గురయ్యామన్నారు. ఇప్పటికీ చాలామంది చర్మవ్యాధులు, ఇతర రోగాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. లేకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కాలనీ ప్రతినిధులు అప్పలరాజు, సాయి, ఆనంద్, వినోద్, చినబాబు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణమయ్య జయంత్యుత్సవాలు



కృష్ణమయ్య జయంతి వేడుకల్లో ఏఈవో ఆనంద్‌కుమార్, కళాకారులు

సింహాచలం: సింహగిరిపై ఆదివారం నుంచి శ్రీకాంత కృష్ణమాచార్య (కృష్ణమయ్య) జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై వేడుకలను దేవస్థానం ఏఈవో ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. కృష్ణమయ్య చిత్రపటానికి పూలమాల వేసి హారతి అందజేశారు. అనంతరం కృష్ణమయ్య కీర్తనలకు పలువురు కళాకారిణులు చేసిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.